క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

పెద్దవడుగూరు: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏపీఎం ఖలీల్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థినుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల కట్టడి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు శంకర్, ప్రవీణ్, రామానంద్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రక్త నమూనాలు సేకరించాలి



మాట్లాడుతున్న వైద్యులు లోకేష్‌కుమార్, శ్రీనివాసులు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం ఆరోగ్య, ఆశాకార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.పెద్దపప్పూరులో రాత్రి పూట ఎంపిక చేసిన ఆరు బృందాల సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఒక్కో బృందం 50 మంది రక్త నమూనాలు సేకరించాలని వైద్యుడు లోకేష్ కుమార్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శర్మావలి,ఆరోగ్య,ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

యల్లనూరు: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఈ నెల 30న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ చక్ర హాస్పిటల్ వైద్యులు విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్యులు 2డీఎకో, ఈసీజీ, బీపీ, కంటి పరీక్షలు చేస్తామన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి గుండె ఆపరేషన్, యాంజియోగ్రామ్, స్టంట్, కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు.

రస్తా సమస్య పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాడిపత్రి: పొలాలకు వెళ్లే రస్తా సమస్య పరిష్కరించాలని కోరుతూ గంగాదేవిపల్లి రైతులు సోమవారం తహసీల్దార్ రజాక్‌వలికి ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రాజారాం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, 100 ఎకరాలకు సంబంధించిన పొలాల్లోకి వెళ్లేందుకు సర్వే నంబర్ 26లో రస్తా ఉందన్నారు. గ్రామానికి చెందిన చింతకుంట రామాంజనేయరెడ్డి, చింతకుంట గంగ భాస్కర్‌రెడ్డి కొద్ది రోజులుగా ఆ రస్తాలో వెళ్లకుండా ఇబ్బందులు పెడుతున్నారని, సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు నరసింహారెడ్డి, గంగశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా డిజైన్ వీక్'లో గేట్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభావంతులను అభినందిస్తున్న గేట్స్ కళాశాల యాజమాన్యం

గుత్తి: తమిళనాడు రాష్ట్రం చెన్నైలో గత ఆదివారం ఇండియాడిజైన్ వీక్ 2025(సౌత్ ఇండియా రీజియన్) గ్రాండ్ ఫైనల్స్‌లో గేట్స్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు బాల ఆదిత్య, మహ్మద్ సొహెల్, విశ్వనాథ్, జగన్ మోహన్ బెస్ట్ డిజైన్ అవార్డును సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు ప్రదర్శనకు వేదికైన ఇండియా డిజైన్ వీక్ 2025 కార్యక్రమానికి దక్షిణ భారతదేశంలోని అనేక మంది ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన గేట్స్ విద్యార్థులకు సోమవారం గేట్స్ కాలేజీలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్, మెకానికల్ హెచ్‌ఓడీ డాక్టర్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి సరే.. ధర ఏదీ?

- ప్రారంభమైన వరి కోతలు
- ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్



శింగనమల సమీపంలో కోతకు సిద్ధంగా వరి పొలం



నిదనవాడలో రోడ్డు మీద వరిధాన్యం

శింగనమల: రబీ సీజన్ కింద శింగనమల మండలంలో వ్యవసాయ బోరులు, చెరువుల కింద వరి పంటను సాగు చేశారు. మండలంలోని శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి, శివపురం, సీ.బండమీదపల్లి, చక్రాయిపేట, పోతురాజుకాల్వ, పెరవలి, జూలకాల్వ, జలాలపురం, కొరివిపల్లి, చీలేపల్లి, రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడి, గురుగుంట్ల, మదిరేపల్లి గ్రామాల్లో రైతులు దాదాపు 2,000 ఎకరాల్లో వరి పంట సాగు చేశారని వ్యవసాయాధికారుల గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం వరి పంట కోతలు మొదలయ్యాయి. అయితే పండించిన పంటకు బయట మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడం లేదు. బయట మార్కెట్ ధరకు వరి ధాన్యం విక్రయిస్తే పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే అవకాశం తక్కువగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

మార్కెట్‌లో క్వింటా రూ.1700

మార్కెట్‌లో వ్యాపారులు 82 కేజీల బస్తా రూ.1400కు కొనుగోలు చేస్తున్నారు. క్వింటా ధర అయితే కేవలం రూ.1700 పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వం అయితే క్వింటాళ్లు రూ.2,300లకు కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతుకు లాభం చేకూరే అవకాశం ఉంది. మండలంలో దాదాపు 2 వేలు ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, ఎకరాకు 30 బస్తాలు ధాన్యం పండే అవకాశం ఉంది. దీనితో మండలంలో దాదాపు 60 వేలు బస్తాలు వరి ధాన్యం పండుతుందని వ్యవసాయాధికారుల అంచనా. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం శింగనమలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

వరికోత యంత్రాలకు డిమాండ్

మండలంలో వరికోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. రెండు, మూడు రోజుల నుంచి ఈదుర గాలులతో కూడిన వర్షం పడుతోంది. దీంతో కోతకు వచ్చిన పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కూలీలు దొరకకపోవడంతో వరికోత యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ఎకరాకు దాదాపు రూ.3 వేలు చెల్లించి వరి పంటను కోయిస్తున్నారు. యంత్రాలతో త్వరగా పని పూర్తవుతుందని, అయితే పశుగ్రాసం దెబ్బతింటుందని రైతులు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



శింగనమల మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. మార్కెట్‌లో బస్తా ధర కేవలం రూ.1400 పలుకుతోంది. ఈ ధరకు అమ్ముకుంటే రైతుకు గిట్టుబాటు కాదు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– రామాంజనేయులు, తరిమెల, శింగనమల మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



శింగనమల మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏప్రగ్రామంలో వరి లభ్యం ఉందనేది, అధికారులకు వివరించాం. త్వరలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

– అన్వేష్ కుమార్, ఏఓ, శింగనమల

రిజిస్ట్రేషన్లకు రేపటి నుంచి స్లాట్ బుకింగ్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ నెల 30 నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని సబ్ రిజిస్ట్రార్ శివనారాయణ సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్లాట్ బుకింగ్ విధానాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ విధానంలో రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ స్లాట్ అందుబాటులో ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో బుకింగ్ ఆప్షన్ ఉంటుందన్నారు. ఆధార్, మొబైల్ నెంబర్ ద్వారా టైమింగ్ సెలక్ట్ చేసుకొని దస్తావేజు చలనాలు నమోదు చేస్తేనే స్లాట్ కన్ఫర్మ్ అవుతుందన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బుక్కరాయసముద్రం: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వేసవిలో రైతులు మట్టి నమూనాల పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాటి ఫలితాలు ఆధారంగా ఖరీఫ్ సీజన్‌లో మందులు వాడాలన్నారు. అనంతరం భూసార పరక్షల నిర్వహణపై కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం సొసైటీ సీఈఓ ముస్తఫా, వ్యవసాయ విస్తరణ అధికారి పవన్, ఓబులపతి, రైతులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం ఇస్తున్న బహుజన సేవాసమితి సభ్యులు

పామిడి: పట్టణంలోని గుత్తి బీసీసీ రోడ్డుకు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం ప్రహరీ, మరుగుదొడ్ల తొలగింపునకు పాల్పడ్డవారిపై చర్యలు చేపట్టాలని బహుజన సేవాసమితి అధ్యక్షుడు కేవీ చలపతి, ప్రధాన కార్యదర్శి చెంచొళ్ల రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వారు డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మినారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అక్రమ పత్రాలతో కోర్టును తప్పుదోవ పట్టించి తెచ్చుకున్న ఆ ఆర్డర్‌పై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమార్కులపై చర్యలు చేపట్టాలన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పామిడి: అర్హులైన నిరుపేదలందరికీ మూడుసెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీని నెరవేర్చాలని సీపీఐ గుంతకల్ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయనతో పాటు సీనియర్ నాయకులు, కౌన్సిల్ సభ్యులు కే రహీమ్, సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. అప్పటి టీడీపీ హయాంలో పామిడిలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో మౌళిక వసతుల కల్పనతో పాటు లిఫ్టులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రేషన్‌కార్డుల్లో బైఫరికేషన్ చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి 3 సెంట్ల నివేశ స్థలంతో పాటు రూ.5 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షాన వామపక్షాలు, ప్రజాసంఘాలను సంఘటితం చేసి దశలవారీగా ఉద్యమిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి సభాస్థలికి వచ్చి సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తాననడంతో వారు ఆందోళన విరమించారు. అంతకుముందు స్థానిక బీసీసీ రోడ్డుపై ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు, మండల కార్యదర్శి నాగరాజు, ఓంకార్, సారాభీ, చౌడప్ప, రాముడు, రవూఫ్, ఇమామ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

శింగనమల: మండలంలో గత పది వారాల నుంచి ఉపాధి హామీ కూలీలు పెండింగ్ ఉన్నారని, వెంటనే మంజూరు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ సంవత్సరంలో 200 పని దినాలు మంజూరు చేయాలని, రోజుకు రూ.600 కూలి మంజూరు చేయాలన్నారు. అడిగి వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. పనుల వద్ద నీడ, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు , మెడికల్ కిట్లు అందించాలన్నారు. పనిముట్లు గడ్డ పార, గంప, గునపం ఇవ్వాలన్నారు. కూలీలకు సమ్మర్ అలవెన్స్, అదనపు వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



గుంతకల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



గుత్తిలో సీపీఎం నాయకుల ర్యాలీ

గుంతకల్లుటౌన్/గుత్తి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. సోమవారం కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి గాంధీచౌక్‌లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్ అహ్మద్, కార్యదర్శి గోపాలక్రిష్ణ, ఏజీపీ హేమాద్రి, న్యాయవాదులు క్రిష్టారెడ్డి, నాగశేషు,రజబ్‌వలి, సత్యనారాయణ, శివరాఫ్, నాగరాజు, శ్యామల, విద్యాసాగర్, బడేసాబ్, ఖలీల్, సురేష్, ఆరీఫ్, మధు, రమేష్, తిమ్మారెడ్డి, ధనుంజయ, ఈదుర్‌వలి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉగ్రవాదులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ మతం పేరుతో మనుషులను చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు రేణుక, రేవతి, మల్లికార్జున, రామేశ్వరి, నారాయణస్వామి, రామ, బావమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీ సమీపంలో ఉన్న ఓ పొలంలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సోమవారం దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేశారు. డ్రోన్ కెమెరా ఆధారంగా నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.5,940 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి: మండలంలోని రావివెంకటాంపల్లిలో మట్కా రాస్తున్న బీటర్ సుధాకర్‌ను సోమవారం రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి మట్కా పట్టీలతో పాటు రూ. 5 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హంతకులను అరెస్ట్ చేయాలి

గుంతకల్లుటౌన్: ఆలూరు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణను హత్యచేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు వై.మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలోని లక్ష్మీనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. అతడి కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ చేయండి

లక్ష్మీనారాయణను హత్య చేసిన దుండగులను ఎన్‌కౌంటర్ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్.జె.ప్రకాష్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మార్చురీలోని లక్ష్మీనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్మీనారాయణకు భద్రత కల్పించడంలో విఫలమైన పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యను సస్పెండ్ చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గంధం శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిష్టన్న, రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్ పాల్గొన్నారు

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



గుంతకల్లులో దీక్షల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు



తాడిపత్రిలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/తాడిపత్రి రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. డిపో కార్యదర్శి నటరాజ్, గ్యారేజీ కార్యదర్శి రమణ, ఉద్యోగులు కండక్టర్లు టీసీ బాషా, నరసింహులు, శ్రీనివాసులు దీక్షలో కూర్చొన్నారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1–2019ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను ఆపాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగినులకు పిల్లల సంరక్షణ సెలవులివ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అలాగే తాడిపత్రిలో డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు స్థానిక డిపో ఆవరణలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. రీజినల్ సెక్రటరీ ప్రతాప్ నారాయణ, డ్రైవర్లు కేజీఎన్‌బాబు, కేకేపీ నాయుడు, టీఎల్ఎన్ రావు కండెక్టర్లు వీఆర్ మోహన్, ఎంఆర్ఎస్‌రెడ్డి, రమణ, ఎలక్ట్రిషియన్ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

30న పాలిసెట్

గుంతకల్లు రూరల్: పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఈనెల 30న నిర్వహించనున్నట్లు గుంతకల్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌పీ రమణా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం గుంతకల్లు మండలంలో దాదాపు 1,100 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పట్టణంలోని సరోజినీ నాయుడు మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, రాజేంద్ర ప్రసాద్ మున్సిపల్ హైస్కూల్, ఎస్‌జేపీ గవర్నమెంట్ హైస్కూల్, ఎస్ఆర్‌కే మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కనీసం గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, విద్యార్థులు తమ వెంట హెచ్‌బీ, 2బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్, పెన్ మాత్రమే తెచ్చుకోవాలన్నారు. ఎలెక్ట్రానిక్ వస్తువులైన స్మార్ట్ ఫోన్, స్మార్ట్ వాచ్, స్మార్ట్ పెన్స్ తదితర వస్తువులు అనుమతించబోమన్నారు. హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే ఈనెల 29వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు.

గాలి బీభత్సం



గాలులకు నేల కొరిగిన అరటి తోట

తాడిపత్రి: మండలంలోని పలు గ్రామాల్లో గాలి సృష్టించిన బీభత్సానికి వివిధ పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లి, వెంకటాంపల్లి, ఆలూరు, ఆవులతిప్పాయపల్లి, వెలమకూరు తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం వీచిన భారీ గాలులకు అరటి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా అరటి చెట్లు గాలులకు నేలకొరిగాయి. అకస్మాత్తుగా వీచిన గాలులతో ఆయా పండ్ల తోటల రైతులకు రూ. కోటిపైగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

పురుగుల మందు డబ్బాతో నిరసన



తహసీల్దార్‌కు పురుగుల మందు చూపుతున్న దృశ్యం

యాడికి: తన ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మిస్తుంటే పక్కంటి వారు అభ్యంతరం తెలుపుతున్నారని, అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని రమేష్ అనే వ్యక్తి సోమవారం యాడికి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ఎదుట నిరసనకు దిగాడు. మూడేళ్లుగా సమస్య ఉందని, న్యాయం చేయపోతే ఇక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. తహసీల్దార్ స్పందించి మరుగు దొడ్డి నిర్మించుకోవడానికి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన నిరసన విరమించాడు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



గుంతకల్లులో మాట్లాడుతున్న లెక్చరర్ వెంకటేశ్వరరావు



తాడిపత్రిలో శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



గార్లదిన్నె గ్రంథాలయంలో శిబిరం నిర్వహించిన దృశ్యం



యల్లనూరులో విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి

గుంతకల్లుటౌన్/గుత్తి/గార్లదిన్నె/యల్లనూరు/యాడికి/పెద్దవడుగూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వక్తలు అన్నారు. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, పుస్తక పఠనం, గణితంలో మెళుకువలు, ఇతర ఇండోర్ గేమ్‌లపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు నిర్వహించారు. మే 6 వరకూ రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ శిక్షణ ఉంటుందని గ్రంథాలయాధికారులు తెలిపారు.

- గుంతకల్లు పట్టణంలోని సోఫియాస్ట్రీట్‌లో ఉన్న ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఉచిత శిక్షణ తరగతులను ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకుడు వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కమ్మన్న, గ్రంథాలయ అధికారిణి హేమలత, సిబ్బంది రాము పాల్గొన్నారు.
- గుత్తిలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపును గ్రంథాలయాధికారి రామాంజనేయులు ప్రారంభించారు. అనంతరం పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు 593 సాధించిన విద్యార్థి నరసింహను సన్మానించి, ప్రశంసా పత్రాన్ని, బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ గ్రంథాలయాధికారి ఏసీ సుబ్బన్న, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.
- గార్లదిన్నెలో గ్రంథాలయ అధికారిణి శిరీష, యల్లనూరులో లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి, సిబ్బంది రామచంద్ర, యాడికిలో గ్రంథాయాధికారి మధుసూదన్ వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. యాడికిలో ఉపాధ్యాయులు జయరాం, ఆంజనేయులు, నాగరాజు, కొత్తరాయుడు తదితరులు పాఠకులు, విద్యార్థులకు శిక్షణ శిబిరంపై అవగాహన కల్గించారు. అలాగే పెద్దవడుగూరులోని గ్రంథాలయంలో ఎంఈఓ రాముడు, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నారాయణ స్వామి, ఉపాధ్యాయులు ఉసేనప్ప వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. అదేవిధంగా తాడిపత్రిలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో గ్రంథాలయ అధికారి బి.రవికుమార్‌నాయుడు, రిసోర్స్ పర్సన్స్ ఆదినారాయణ స్వామి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటరామయ్య పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి విరాళం

పామిడి: మండలంలోని పాళ్యంతండా గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి స్థానిక న్యాయవాది సురేష్‌నాయక్ రూ.13 వేలు విరాళం ఇచ్చారు. ఆ డబ్బు ఆ గ్రామపెద్దల సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా వైశాఖ మాస పూజలు



భోగేశ్వరుడు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో వైశాఖమాస సోమవారాన్ని పురస్కరించుకొని విశేషపూజలు నిర్వహించారు. మూలవిరాట్ భోగేశ్వరుడిని అర్చకులు పూలు. పండ్లతో శోభాయానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్‌కుమార్ అభిషేకార్చనలు, మహాన్యాస పూర్వక ఏకాదశి, రుద్రాభిషేకం, అష్టోత్తర శతమావళి వంటి ప్రత్యేక పూజలు చేశారు. మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

'దారి మూసేయొద్దు'

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న దారిని సెంట్రల్ యూనివర్శిటీ అధికారులు మూసేస్తున్నారని, ఆ దారి మూసేయకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ పుణ్యవతికి రైతులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జంతలూరు, కొర్రపాడు గ్రామాలకు వెళ్లే దారిని సెంట్రల్ యూనివర్శిటీ అధికారులు మూసేస్తుండడంతో 250 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, వడ్డే రామాంజినేయులు, నాగప్ప, నగేష్, నాగలింగ, ఎర్రప్ప, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.